నిజం మా నైజం...!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com | ఎడిటర్ : చింతల రామకృష్ణ | సంపుటి: 5 | సంచిక: 30 | మంగళవారం, 30 జూన్ 2026 | పేజీలు - 8 | వెల : 3/-




# బీజేపీ, కాంగ్రెస్ రెండూ మూసీకి ఉరి



**వికారాబాద్:వాస్తవ తెలంగాణ** బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలూ కలిసి మూసీకి ఉరేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మోడీ భయంతోనే నేవీ రాడర్‌కు రాష్ట్ర ప్రభుత్వం 2900 ఎకరాల భూమి అప్పగించిందని తెలిపారు. దీని కోసం 12లక్ష?ల చెట్లు నరికివేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని గౌలి కార్ ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్ష?్నడు డాక్టర్ మెతుకు ఆనంద్ అధ్యక్షతన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం, సర్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కేటీఆర్, మెతుకు ఆనంద్ ఎన్నెపల్లి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ అప్పులు చేశాడని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పదేపదే చెప్పడం సరైంది కాదన్నారు. అప్పులు చేసిన కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేండ్లలో ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు నేవీ రాడర్‌కు భూములు అడిగితే ఇవ్వలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బీజేపీతో కుమ్మక్కై దామగుండంలో నేవీ రాడర్‌కు భూములిచ్చిందని తెలిపారు. వికారాబాద్ నియోజకవర్గ పరిధిలో పదివేల ఎకరాలకు నీళ్లు అందించే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేశారని అన్నారు. తాము 90శాతం పనులు పూర్తి చేశామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ ప్రాజెక్టును పక్కన పెట్టిందని అన్నారు. కేసులకు కార్యకర్తలు, నాయకులు భయపడవద్దని తెలిపారు.

# పల్స్‌పోలియో విజయవంతం



**హైదరాబాద్:వాస్తవ తెలంగాణ** రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం జయప్రదమైంది. రాష్ట్రంలో 0-5 ఏండ్ల లోపు పిల్లలు 40,97,749 మంది ఉంటారని అంచనా వేయగా, అందులో 38,95,550 ?మంది (95.1 శాతం) చిన్నారులకు తొలి రోజే పోలియో చుక్కల పంపిణీ పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన పల్స్ పోలియో బూత్‌లకు పెద్ద ఎత్తున తల్లిదండ్రులు తమ చిన్నారులను తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించడం పట్ల హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సహకారం, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా సాగిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పల్స్ పోలియో కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించామని కమిషనర్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా 99 శాతం కవరేజ్‌తో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవగా, భద్రాద్రి కొత్తగూడెం 98.9 శాతం, మెదక్ 98.6 శాతం, ములుగు, వనపర్తి జిల్లాలు 98.2 శాతం, జయశంకర్ భూపాలపల్లి 98.1 శాతం కవరేజ్ సాధించాయి. హైదరాబాద్ జిల్లాలో 93.1 శాతం పూర్తయింది. ఆదివారం నాడు పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించి సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యశాఖ బృందాలు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచనల మేరకు ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఐదేండ్లలోపు ప్రతి చిన్నారికి కూడా తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లి దండ్రులకు కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.



## సీఎం రైతు ఆశీర్వాద సభ రద్దు

భారీ వర్షాలే కారణం

# వానాకాలం సాగుకు.. పెట్టుబడి సాయం

**రేపే రైతు భరోసా నిధులు విడుదల**

- హైదరాబాద్‌లో ప్రత్యేక కార్యక్రమం
- సీఎం రేవంత్ చేతుల మీదుగా రైతుల ఖాతాల్లో జమ
- జులై 15లోపు రైతులందరికీ జమ చేసేలా ప్రణాళిక
- బ్యాంకుల్లో క్యాష్ సర్దుబాటు చేయాలని ఆర్‌బీఐకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ
- ఉద్యోగుల బకాయిలకు ₹2 వేల కోట్లు
- వేతనాలు, పెన్షన్లు, స్కీమ్‌లతో జులై ఒక్క నెలలోనే ₹20 వేల కోట్లు ఖర్చు
- ఆర్‌బీఐ నుంచి ₹11,500 కోట్ల రుణం ..
- రాష్ట్ర సొంత ఆదాయం సర్దుబాటుకు చర్యలు

5

రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం నిధులను సిద్ధం చేసింది. వానాకాలం సీజన్ 'రైతు భరోసా' పథకం పంపిణీ ప్రక్రియ ఈనెల 30వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా పంపిణీ సదస్సుగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో నిర్వహించాలని మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి మంత్రులకు సూచించారు. ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఈ సమావేశం రేపు సాయంత్రం 4 గంటలకు జరగనుంది.

# ఎస్ఎల్ బీసీ -- డిండి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

**మూసీ ప్రక్షాళనే నా జీవిత లక్ష్యం**

**నల్లగొండలో 'ప్రజా పాలన- ప్రగతి పాలన' సభలో సీఎం రేవంత్ రెడ్డి**

**ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు సిద్ధం..బీఆర్ఎస్, బీజేపీకి బహిరంగ సవాల్**

**రూ.1,3006 కోట్లతో హ్యామ్ రోడ్ల పనులకు శంకుస్థాపన**

**కనగల్ మండలంలో పైలాన్ ఆవిష్కరణ**



**నల్లగొండ వాస్తవ తెలంగాణ** 'నల్లగొండ జిల్లాకు సాగు నీరందించే ఎస్ఎల్‌బీసీ--డిండి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. మూసీ ప్రక్షాళనే నా జీవిత లక్ష్యం. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమాన ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తున్నాం' అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కనగల్‌లో రూ.1,3006 కోట్ల వ్యయంతో హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) విధానంలో చేపట్టనున్న ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ సమీపంలో నల్లగొండ--దేవరకొండ ప్రధాన రహదారిపై ఏర్పాటుచేసిన హ్యామ్ రోడ్డు ప్రాజెక్టు పైలాన్‌ను సీఎం ఆవిష్కరించారు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6092.37 కిలోమీటర్ల మేర 441 రహదారుల విస్తరణ అభివృద్ధి పనులను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం నల్లగొండ పట్టణంలో మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. తర్వాత నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన 'ప్రజాపాలన--ప్రగతిపాలన' బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మూసీ నది ప్రక్షాళనను తన జీవిత లక్ష్యంగా తీసుకొని అమలు చేస్తున్నానని తెలిపారు. తెలంగాణ భవిష్యత్‌కు అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణంలో ప్రభుత్వం వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో నల్లగొండ జిల్లా త్యాగాలు చిరస్మరణీయమని తెలిపారు. తొలి ఉద్యమంలో మంత్రి పదవిని త్యజించిన కొండా లక్ష్మణ్ బాపూజీ, మలి ఉద్యమంలో మంత్రి పదవికి రాజీనామా చేసి ఆమరణ నిరాహార దీక్ష చేసిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి సేవలను కొనియాడారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి, కానిస్టేబుల్ కిష్టయ్య, యాదయ్య తదితర అమరవీరులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.




# కుప్పలు తెప్పలుగా.. డూప్లికేట్ ఓట్లు

**రేవంత్ రెడ్డి గెలిచింది ఆ ఓట్లతోనే**

- కొడంగల్‌లో ఏకంగా 32 వేల డూప్లికేట్స్
- డబుల్ ఓట్లను తొలగించాలని కవిత డిమాండ్

5

తెలంగాణలో కుప్పతెప్పలుగా డూప్లికేట్ ఉన్నాయని, వాటిని తక్షణం తొలగించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని.. తొలగించేందుకు ఏడేళ్లు పట్టిందన్నారు. హైదరాబాద్‌లో ఉన్న వేలాదిమందికి ఏపీలో కూడా ఓట్లు ఉన్నాయన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. బోధన్ నియోజకవర్గంలో ఏడాదిలో 7 వేల ఓట్లు తీసేశారని.. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఆక్రమణలపై దుండిగల్ అధికారుల ఉక్కుపాదం


**-మల్లంపేట్, బౌరంపేట్‌లో ప్రత్యేక డ్రైవ్**
**-ఫుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాల తొలగింపు**
**-100 ఫీట్ల రోడ్డు విస్తరణకు మార్కింగ్ పనుల పరిశీలన**
**-బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో బహిరంగ స్థల ఆక్రమణ యత్నానికి అడ్డుకట్ట**
**-ప్రజా స్థలాల ఆక్రమణదారులపై కఠిన చర్యలు తప్పవని అధికారుల హెచ్చరిక**



**దుండిగల్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు..** నగరంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఆక్రమణలపై దుండిగల్ మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా సోమవారం మల్లంపేట్, బౌరంపేట్ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు, బహిరంగ స్థలాలను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపారు. ఈ నేపథ్యంలో మల్లంపేట్‌లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను అధికారులు గుర్తించి వెంటనే తొలగించారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఫుట్‌పాత్‌లను పూర్తిగా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇదే సందర్భంగా మల్లంపేట్ 100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన రోడ్ మార్కింగ్ పనులను అధికారులు పరిశీలించారు. విస్తరణకు సంబంధించిన సాంకేతిక అంచనాలను సిద్ధం చేసి తదుపరి చర్యలకు శ్రీకారం చుట్టారు. అదేవిధంగా బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో బతుకమ్మ ఆడే బహిరంగ ప్రాంగణంలో అక్రమంగా చిన్న చిన్న దుకాణాలను నిర్మిస్తున్నట్లు సమాచారం అందడంతో అధికారులు వెంటనే స్పందించారు. నిర్మాణ పనులను నిలిపివేసి, బహిరంగ స్థలాలను ఆక్రమించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆక్రమించనివ్వబోమని స్పష్టం చేశారు. ప్రత్యేక డ్రైవ్‌లో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. నగరంలో ఫుట్‌పాత్‌లు, రహదారులు, పార్కులు, బహిరంగ స్థలాలను పరిరక్షించడం తమ ప్రధాన బాధ్యత అని అధికారులు తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే ఆక్రమణలపై ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లను నిరంతరం కొనసాగిస్తూ, నిబంధనలు ఉల్లంఘించే వారిపై రాజీ లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు

**-అధికారులకు అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు**
**-ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి**
**-సోమవారం ప్రజావాణిలో 95 దరఖాస్తుల స్వీకరణ**
**-తిరస్కరించిన అర్జీలకు కారణాలు తప్పనిసరిగా తెలియజేయాలి**
**-ప్రతి దరఖాస్తుపై తీసుకున్న చర్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి**
**-డీఆర్వో మాలతితో కలిసి అర్జీల స్వీకరణ**



**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీఆర్వో మాలతితో కలిసి స్వీకరించారు. మొత్తం 95 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయనే విశ్వాసంతో సమయం, ధనం వెచ్చించి ప్రభుత్వ కార్యాలయాలకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి అధికారిపై ఉన్న బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని సకాలంలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, ఏవైనా దరఖాస్తులను తిరస్కరించాల్సి వచ్చినప్పుడు అందుకు గల కారణాలను స్పష్టంగా, పూర్తి వివరాలతో సంబంధిత అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు.

దరఖాస్తులపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ వ్యవస్థలో నమోదు చేసి పారదర్శకతను పాటించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ఘన వ్యర్థాల నిర్వహణే మార్గం

**తడి--పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి.**
**జిల్లాలో ఘన వ్యర్థాల నిర్వహణకు శ్రీకారం.**
**సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలి.**
**కలెక్టరేట్‌లో డస్ట్‌బిన్ల ఏర్పాటు ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత కోసం జిల్లాలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నియమాలు--2026ను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో తడి, పొడి, సానిటరీ, హానికర వ్యర్థాల కోసం ప్రత్యేక డస్ట్‌బిన్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించి తడి చెత్తను గ్రీన్ బిన్‌లో, పొడి చెత్తను బ్లూ బిన్‌లో, సానిటరీ వ్యర్థాలను రెడ్ బిన్‌లో, హానికర వ్యర్థాలను బ్లాక్ బిన్‌లో వేర్వేరుగా వేయించే విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణను శాస్త్రీయ పద్ధతిలో అమలు చేయాలని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటి చెత్త సేకరణ, తడి--పొడి వ్యర్థాల వేర్వేరు సేకరణ, రవాణా, ప్రాసెసింగ్ ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారవేయడం, చెత్తను కాల్చివేయడాన్ని పూర్తిగా అరికట్టాలని సూచించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో చెత్త పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, అపార్ట్‌మెంట్లు, పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థలు, ఫంక్షన్ హాళ్లను బల్క్ వేస్ట్ జనరేటర్లుగా గుర్తించి నిబంధనల ప్రకారం ఘన వ్యర్థాల నిర్వహణ చేపట్టాలని తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీపీఓ యాదయ్య, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు, డీఎఫ్‌వో జోజి, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




# 70 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్..





**గుమ్మడిదల,వాస్తవ తెలంగాణ న్యూస్:** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్, నల్లవల్లి, కొత్తపల్లి, నాగిరెడ్డి గూడెం, కానుకుంట, అనంతారం, గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా మంజూరైన 70 లక్షల నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సోమవారం మండల ప్రజా ప్రతి నిధులతో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ...ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకొని వెళ్ళడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నిర్దేశించిన గడువులోగా అభివృద్ధి పనులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, ఎంపీడీవో ఉమాదేవి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ గుమ్మడిదల మండల అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సద్ది విజయ భాస్కర్ రెడ్డి, నక్క వెంకటేష్ గౌడ్, సర్పంచులు కొత్తకొండ భాస్కర్, కొరివి రాణి సురేష్, సూరారం మంజుల సత్తయ్య, గడ్డం లావణ్య గోవర్ధన్ రెడ్డి, కొమ్ము శ్రీను, ఇప్ప పెంటారెడ్డి, బుద్దుల దుర్గ నర్సింగ్ రావు, కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కల్తీకల్లు పై ప్రజావాణిలో ఫిర్యాదు



**వాస్తవ తెలంగాణ న్యూస్ నారాయణఖేడ్** నారాయణఖేడ్ నియోజకవర్గంలో పాటు మండలంలో విచ్చలవిడిగా కల్తీకల్లు అమ్మకాలపై మరియు కల్లు షాపులకు అనుమతులు ఒకచోట ఉండగా అమ్మకాలు మరొక చోట నిర్వహిస్తున్నారని నారాయణ్ ఖేడ్ కు చెందిన సామాజిక కార్యకర్త పుండరీకం సోమవారం ప్రజావాణిలో సబ్ కలెక్టర్ ఉమాహారతికి కంప్లైంట్ చేశారు.కల్తీకల్లు తాగడంతో కుటుంబ పెద్ద అనేక ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కోవడంతో మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా అస్తవ్యస్తంగా తయారవుతున్నాయన్నారు. ఇప్పటికైనా కల్తీకల్లు విక్రయిస్తున్న పలువురు షాప్ యజమానులపై అధికారులు చర్యలు తీసుకుని కల్తీ కళ్ళు మహమ్మారి నుండి ప్రజలను కాపాడాలని పుండరీకం సబ్ కలెక్టర్ ఉమా హారతిని కోరగా సానుకూలంగా స్పందించిన సబ్ కలెక్టర్ ఆబ్కారీ శాఖ అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

# శివనామస్మరణతో మారు మ్రోగిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయం



**శంకర్‌పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో వెలసిన 11 వ శతాబ్దపు మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో సోమవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా స్వామి వారికి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. అనంతరం కోరిన కోరికలు తీర్చే రాయి వద్ద భక్తులు బారులు తీరారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అర్చకులు శివసాయి ప్రసాద్, సౌందర్య, లలిత, ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన సుమిత్ర మల్లేశం దంపతులు అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



# ఖేడ్ మున్సిపల్ జనరల్ బాడీ మీటింగ్ లో పలు తీర్మానాల ఆమోదం




**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్..** నారాయణఖేడ్ మున్సిపల్ ఆఫీసులో సోమవారం జనరల్ బాడీ పార్టీ మీటింగ్ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ నగేష్ శెట్కార్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించగా స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో మున్సిపల్ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించి, వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతులు, 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలు, పారిశుధ్య నిర్వహణ, మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు తదితర అంశాలకు ఆమోదం తెలిపారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని అన్నారు. మీటింగ్ లో మున్సిపల్ కమిషనర్ ప్రశాంతి, మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, వివిధ వార్డు సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తున్న బి ఆర్ ఎస్ నాయకులు డాక్టర్ నర్ల సురేష్

**వాస్తవ తెలంగాణా డైలీ న్యూస్ బొల్లారం** /.మచ్చ బొల్లారం లోని బూత్ నెంబర్ 395 లో ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్లు తప్పనిసరిగా తమ ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి పూర్తిచేసి బిఎల్ఓ లకు అందజేయాలని లేకపోతే ఓటు కోల్పోయే అవకాశం ఉందని ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ఓటర్లకు అవగాహన చేస్తూ ప్రతి ఒక్క ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేస్తున్నామని సామాజిక సేవలో గౌరవ డాక్టరేట్ గ్రహీత బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ నర్ల సురేష్ తెలిపారు ఈ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో బూత్ లెవెల్ ఆఫీసర్ వెంకటేష్, బూత్ లెవెల్ అసిస్టెంట్ గోవర్ధన్, బూత్ లెవెల్ అసిస్టెంట్ మహేష్ రాజ్ పాల్గొన్నారు.



# శంకర్‌పల్లి మోడల్ స్కూల్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు: ప్రిన్సిపల్ శోభారాణి



**శంకర్‌పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** శంకర్‌పల్లి పీఎం తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శోభారాణి సోమవారం తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపిసి, సిఇసి, ఏసిఈ సీట్లకు జులై 1 న స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు బోనఫైడ్, టిసి, టెన్త్ మార్క్స్ మెమోతో కళాశాలకు రావాలని ప్రిన్సిపాల్ సూచించారు.


# వెంకటాపూర్లో అట్టహాసంగా ఏరువాక పౌర్ణమి



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్** నారాయణఖేడ్ పట్నంలోని వెంకటాపూర్ గ్రామంలో ఏరువాక పౌర్ణమి పండుగను సోమవారం గ్రామ ప్రజలు, సర్పంచ్ సురేష్ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురేష్ మాట్లాడుతూ వ్యవసాయమే దేశానికి వెన్నెముక. రైతును, భూమిని, పశువులను గౌరవించడం మన సంస్కృతిలో ముఖ్యమైన బాగమన్నారు.ఏరువాక పౌర్ణమి అనేది రైతులు కొత్త వ్యవసాయ పనులకు శ్రీకారం చుడుతూ,మంచి పంటలు పండాలని భగవంతుడిని ప్రార్థించే సంప్రదాయ రైతు పండుగని ప్రత్యేకంగా గ్రామంలోని ఎడ్లను ఆవులను ముస్తాబు చేసి రైతుల పనిముట్లతో ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించి వాళ్ళ చేన్లలో నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖేడ్ సైలార్క్ హాస్పిటల్ లో మెరుగైన సేవలు

## వృద్ధురాలి మోకాలు మార్పిడి విజయవంతం..



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్..** తెలంగాణ రాష్ట్రంలోనే వెనుకబడిన నారాయణఖేడ్ ప్రాంతంలో సరైన వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో మెరుగైన వైద్య సేవల కోసం నారాయణఖేడ్ నియోజకవర్గం ప్రజలు దగ్గరలో ఉన్న బీదర్,సంగారెడ్డి,హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలు చేసుకునేవారు. హైదరాబాద్ లాంటి పట్టణ ప్రాంతాల్లో కనిపించే అత్యాధునిక పరికరాలతో కూడుకున్న సదుపాయాలు నారాయణఖేడ్ లో సై లార్క్ ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు. కాగా ఎముకల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ రోహిత్ రాథోడ్ ఆధ్వర్యంలో 60 సంవత్సరాల వృద్ధురాలికి మోకాలి చికిత్స విజయవంతమైంది. అనంతరం డాక్టర్ రోహిత్ రాథోడ్ మాట్లాడుతూ పూర్తి మోహాకలికి శస్త్ర చికిత్స నారాయణఖేడ్ లాంటి మారుమూల ప్రాంతాల్లో నిర్వహించడం ఈ ప్రాంత ప్రజలకు సువర్ణ అవకాశం ప్రజలు సై లార్క్ ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందుబాటులో ఉన్నాయని ప్రజలు ఇట్టి అవకాశాన్ని వినియోగించుకోవాలని డాక్టర్ రోహిత్ రాథోడ్ తెలిపారు.ఆసుపత్రిలో నిర్వహించిన మొదటి మోకాలు శాస్త్ర చికిత్స కు సహకరించిన ఆస్పత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో డాక్టర్ శివ.మేనేజింగ్ డైరెక్టర్ బేమర రవి కిరణ్ రెడ్డి ఆస్పత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మూసివేసిన నాగదేవత టెంపుల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభం

**వాస్తవ తెలంగాణా డైలీ న్యూస్ కంటోన్మెంట్ /** ప్రాథమిక పాఠశాల, నాగదేవత టెంపుల్ ఈ విద్యా తిరుమలగిరి మండల డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఆదేశాల మేరకు పాఠశాల పునఃప్రారంభం చేయడం టెక్స్ట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నమోదు లేకపోవడంతో సుమారు మూడు పాఠశాలను, బడిబాట కార్యక్రమం సందర్భంగా నియమించి తిరిగి ప్రారంభించారు.పాఠశాల మంచి స్పందన లభిస్తుండగా, ఇప్పటికే పదికి పైగా రోజుల్లో మరిన్ని ప్రవేశాలు నమోదవుతాయని మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన చేయాలనే లక్ష్యంతో ఈ పాఠశాలను × ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ తీసుకుంటూ, వారి సమగ్ర అభివృద్ధికి కృషి ఆ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య వ్యవస్థపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని ఉపాధ్యాయురాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



.తిరుమలగిరి మండల పరిధిలోని ప్రభుత్వ సంవత్సరంలో తిరిగి పునఃప్రారంభించబడిందాని, విక్రమాదిత్య తెలిపారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ జరిగిందని, తదనంతరం విద్యార్థులకు బుక్స్, విక్రమాదిత్య మాట్లాడుతూ... గతంలో విద్యార్థుల సంవత్సరాల క్రితం మూసివేయబడిన ఈ ప్రత్యేక చర్యలు తీసుకుని ఇద్దరు ఉపాధ్యాయులను పునఃప్రారంభం అనంతరం విద్యార్థుల నుంచి నూతన విద్యార్థులు ప్రవేశాలు పొందారు. రానున్న అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పేద ప్రభుత్వ విద్యను వారి నివాస ప్రాంతానికే చేరువ పునఃప్రారంభించాం.
విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు చేస్తున్నామని తెలిపారు. ఈ పునఃప్రారంభం ద్వారా అందుబాటులోకి రావడంతో పాటు ప్రభుత్వ విద్యా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల

# నాణ్యతలేని మరమ్మత్తు పనులు..



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్.** నారాయణఖేడ్ మండల పరిధిలోని జూకల్ శివారులో గల తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు కళాశాలలో విద్యార్థులు నిద్రించే భవనంలో మరమ్మత్తులు చేపట్టడానికి గత ఏడాది క్రితం హరి అనే వ్యక్తి 50 లక్షల టెండర్ దక్కించుకున్నాడు. ఏడాదికి పైగా పనులు చేస్తూ ఈ మధ్యనే పూర్తి చేశాడు.పంచాయతీ రాజ్ శాఖ, గురుకులం ప్రిన్సిపాల్ పర్యవేక్షణలో పనులు పూర్తిచేశానని సదరు కాంట్రాక్టర్ చెబుతున్నాడు. కాగా భవనంలో మరుగుదొడ్లు,ఎలక్ట్రీషియన్,ప్లంబింగ్,తలుపులు,కిటికీలు కొత్తవి ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం 50 లక్షల రూపాయలు మంజూరు చేసింది. పనులు పూర్తికాకుండానే అసంపూర్తి పనులతో క్వాలిటీ లేకుండా సదరు కాంట్రాక్టర్ పనులన్నీ పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ తో సంతకాలు తీసుకొని, పంచాయతీరాజ్ శాఖలో బిల్స్ సబ్మిట్ చేశాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్కూలు సందర్శించి పనుల పురోగతిని పరిశీలించి పిల్లలకు మంచి సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని పేరెంట్స్ కోరుతున్నారు.



# పార్టీ బలోపేతంలో బీఎల్ఏల పాత్ర కీలకం



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో బీఎల్ఏల పాత్ర ఎంతో కీలకమని,ఓటరు జాబితాపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి, అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదు అయ్యేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని మాజీ డిప్యూటీ స్పీకర్, టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం.పద్మ దేవేందర్ రెడ్డి బిఎల్ఏలకు సూచించారు. సోమవారం మెదక్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మెదక్ పట్టణానికి చెందిన బీఎల్ఏలకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా అత్యంత కీలకమైందని, దానిని ఎప్పటికప్పుడు పరిశీలించి లోపాలు లేకుండా చూడాల్సిన బాధ్యత బీఎల్ఏలపై ఉందన్నారు. ఎన్నికల సంఘం చేపట్టే ప్రతి కార్యక్రమంపై పూర్తి అవగాహనతో పనిచేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా,అనర్హుల పేర్లు తొలగించేలా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పార్టీ దృష్టికి తీసుకెళ్లాలని, పార్టీ కార్యక్రమాలను ఇంటింటికీ చేరవేయడంలో సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల మధ్య సమన్వయంతో పనిచేస్తే సంస్థాగతంగా పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు.రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి బూత్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని,ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వొద్దని సూచించారు. ప్రతి బీఎల్ఏ తనకు కేటాయించిన బూత్‌లో నిరంతరం ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మెదక్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అకిరెడ్డి.కృష్ణారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు,కౌన్సిలర్లు జుబెర్ అహ్మద్,బట్టి ఉదయ్, మ్యాదరి. దీపక్ కుమార్,మాజీ కౌన్సిలర్ లు మాయ. మల్లేశం,బీమరి కిషోర్, పార్టీ బిఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.


# అరెస్టులతో ఉద్యమాలను అడ్డుకోలేరని జిల్లా కమిటీల స్పష్టం




**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు.....** యూఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు ఎం. చంద్రకాంత్, బీజేవైఎం నాయకుడు నరేష్ అరెస్టులను యూఎస్ఎఫ్ఐ, బీజేవైఎం జిల్లా కమిటీలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు సోమవారం సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ప్రజా సమస్యలు, విద్యార్థుల హక్కులు, ఫీజుల భారం, నిరుద్యోగ సమస్యలపై శాంతియుతంగా పోరాడుతున్న నాయకులను జీడిమెట్ల పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని ప్రకటనలో ఆరోపించాయి. ముందస్తు సమాచారం లేకుండా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నాయి. విద్యార్థులు, యువత లేవనెత్తుతున్న సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వాటిని ప్రశ్నిస్తున్న వారిపై కేసులు నమోదు చేయడం ఆందోళనకరమని అభిప్రాయపడ్డాయి. ఫీజుల దోపిడీని అరికట్టాలని, నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరడం నేరం కాదని పేర్కొన్నాయి. ఈ సందర్భంగా చంద్రకాంత్, నరేష్‌లపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును గౌరవించాలని, పోలీసు నిర్బంధాలకు స్వస్తి పలకాలన్నారు. విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అరెస్టులు, కేసులు, నిర్బంధాలతో విద్యార్థి, యువజన ఉద్యమాలను అణచివేయడం సాధ్యం కాదని, ప్రజా సమస్యల పరిష్కారం వరకు తమ పోరాటం కొనసాగుతుందని యూఎస్ఎఫ్ఐ, బీజేవైఎం జిల్లా కమిటీలు తమ ప్రకటనలో స్పష్టం చేశాయి.??


# పేదలకు వైద్య భరోసా.. రూ.58 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు....** పేద, మధ్యతరగతి




కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకం ద్వారా మంజూరైన రూ.58 లక్షల విలువైన 172 చెక్కులను సోమవారం చింతల్‌లోని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు కలిసి 172 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.58 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. వైద్య చికిత్సల కోసం మంజూరైన ఈ ఆర్థిక సాయం పలువురు నిరుపేద కుటుంబాలకు ఊరటనివ్వనుంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయ నిధి పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించడంలో కీలకంగా నిలుస్తోందన్నారు. ఆపదలో ఉన్న ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బి ఆర్ ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందిన ఆర్థిక సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

# దుండిగల్‌లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి




**దుండిగల్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు....** దుండిగల్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్ అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పరిశుభ్రమైన వాతావరణం అత్యంత కీలకమని పేర్కొంటూ సోమవారం సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న శానిటేషన్ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చెత్త సేకరణ, రోడ్ల శుభ్రత, వ్యర్థాల తొలగింపు పనులు నిరంతరాయంగా కొనసాగాలని సూచించారు. ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు వ్యర్థాలను తరలించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని, ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సమస్యలను వేగంగా పరిష్కరించాలని అధికారులను డిప్యూటీ కమిషనర్ ఆదేశించారు. సేవల నాణ్యత పెంపుదలతో పాటు పరిశుభ్రమైన పరిసరాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి పాల్గొని పారిశుద్ధ్య పనుల పురోగతిని వివరించారు. అనంతరం క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను అధికారులు సమీక్షించి, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ విభాగం సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నిర్దేశిత షెడ్యూల్ ప్రకారమే సవరణ ప్రక్రియ పూర్తి చేయాలి

**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ ప్రతినిధి:-** భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ మేరకు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, పూరించిన ఫారాలను సేకరించే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 1లోగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేసి, జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహించాలని తెలిపారు. ప్రతిరోజూ పురోగతి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించి, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో నమోదయ్యేలా చూడాలన్నారు. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు కావడం చట్టరీత్యా శిక్షార్హమని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పేర్లు, ఇంటిపేర్లు, మహిళల



వివాహానంతర ఇంటిపేరు మార్పులు తదితర వివరాలను జాగ్రత్తగా పరిశీలించి నమోదు చేయాలని చెప్పారు.రాజకీయ పార్టీలతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ బూత్ లెవల్ ఏజెంట్లతో తరచూ సమావేశాలు నిర్వహించాలని, ప్రతి శనివారం జిల్లా స్థాయిలో, ప్రతి వారం నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. బీఎల్ఓలు తప్పనిసరిగా బీఎల్ఓ యాప్‌ను వినియోగించాలని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. గిరిజన, సరిహద్దు ప్రాంతాల్లో స్థానిక భాష తెలిసిన సిబ్బందిని వినియోగించాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో బూత్ స్థాయి అధికారులకు శిక్షణ పూర్తయిందని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలు, బీఎల్ఓ కిట్లు, ప్రచార సామగ్రి పంపిణీ పూర్తిచేసి ఇంటింటి సర్వే కొనసాగుతోందన్నారు. ప్రతి ఫారంపై సంబంధిత ఓటరు సంతకం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, కొత్తగా నియమితులైన బీఎల్ఓలకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు జిల్లాలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్, నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ గఫార్, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా ప్రక్షాళనలో ప్రతి అర్హుడూ భాగస్వామి కావాలి

**గాజులరామవరం, వాస్తవ తెలంగాణని ప్రతినిధి దుర్గారావు** కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన పౌరుడు తప్పనిసరిగా భాగస్వామి కావాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. గాజులరామవరం డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను ఆయన స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు బూత్ స్థాయి అధికారులు అందజేసే గణన ఫారంలో తమ పూర్తి వివరాలను సక్రమంగా నమోదు చేసి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా సర్వే నిర్వహించాలని కోరారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల నమోదైన ఓట్లను గుర్తించి తొలగించడంతో పాటు నకిలీ ఓట్లను పూర్తిగా నిర్మూలించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఈ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం జూలై 24వ తేదీ వరకు కొనసాగనున్నందున ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు కావడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సీహెచ్ బుచ్చిరెడ్డి, సంతోష్ గుప్తా, యువ కాంగ్రెస్ నాయకులు సంతోష్, సతీష్, మధుకర్, నరేష్, మారుతి, అశోక్, రవి గుప్తా, రామిరెడ్డి, దేవదాస్, ఉప్పల సంతోష్, రాజు, ఆనంద్, ఉప్పల రాములు, లక్ష్మి, రజిత, రాధిక, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ రహిత సమాజం లక్ష్యంగా లయన్స్ క్లబ్ ముందడుగు

**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే లక్ష్యంతో లయన్స్ ఇంటర్నేషనల్ లయన్సిక్--2026-27 సంవత్సరానికి సంబంధించిన ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా జ్యూట్ బ్యాగ్స్‌ను ఆవిష్కరించి, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కందుకూరులోని నిమ్మల కన్వెన్షన్‌లో నిర్వహించిన ప్రిలిమినరీ క్యాబినెట్ సమావేశంలో లయన్స్ గవర్నర్ ఎలెక్ట్ డా. ఎం. విజయలక్ష్మి జ్యూట్ బ్యాగ్స్‌ను ఆవిష్కరించారు. లయన్ ఎ. అమర్నాథ్ రావు, మల్టిపుల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణ విభాగానికి సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గవర్నర్ ఎలెక్ట్ డా. ఎం. విజయలక్ష్మికి సభ్యులు అభినందనలు తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, జ్యూట్ బ్యాగ్స్ వంటి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రజలు విస్తృతంగా వినియోగించాలని ఆమె సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్న ఆమె, ప్రజల్లో పర్యావరణ స్పృహ పెంపొందించే కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తృతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించేందుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ హనుమంత నాయుడు, లయన్ అమరేందర్ రెడ్డి, లయన్ ధర్మేంద్ర రెడ్డి, లయన్ నాగమల్లేశ్వరావు, లయన్ శ్రీమతి త్రిపురనేని పద్మావతి, లయన్ నరసింహరాజు, లయన్ డా. ప్రఫుల్ రెడ్డి, ఆర్‌సీ సంతోష్ కుమార్, లయన్ రామ్మోహన్ సౌభాగ్యతో పాటు అధిక సంఖ్యలో లయన్స్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



స్పెషల్ స్టోరీ

## ఆ గూడు చూస్తే..
# బుట్టలో పడాల్సిందే!
## గిజిగాడి ఆర్కిటెక్ అదుర్స్

- తుపాను, పెనుగాలులను తట్టుకునేలా నిర్మాణం
- అందరినీ ఆకట్టుకుంటున్న బుల్లి పిట్ట గూడు
- ఆదిలాబాద్ జిల్లాలో కనువిందు చేస్తున్న గూళ్లు
- సహజీవనానికి నిదర్శనం అంటున్న శాస్త్రవేత్తలు





బుల్లి పిట్ట మేధస్సు.. అద్భుతమైన ఇంజనీరింగ్ నైపుణ్యం.. సహజీవనానికి చక్కటి నేర్పరితనం, ఆర్కిటెక్ తో 'గిజిగాడి' గూళ్లు ప్రతి ఒక్కరిని అబ్బురపరుస్తున్నాయి. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో కాలువలు, చెరువుల గట్లపైన ఈత, తుమ్మ ముళ్ల చెట్ల కొమ్మలకు వేలాడే సొగసైన గడ్డి పోచల గూళ్లు ప్రతి ఒక్కరిని ఫిదా చేస్తున్నాయి. బుల్లి పిట్ట విహంగ పక్షులు తమ చిట్టి మేధస్సు, నేర్పరితనంతో కేవలం మూడు వారాల్లోపే గడ్డి పోచలతో సొంతంగా గూడు నిర్మించుకొని ఆడ పక్షిని ఆకట్టుకుంటూ సహజీవనం సాగిస్తున్నాయి. మానవ మేధస్సు, ప్రతిభా నైపుణ్యానికి ఏమాత్రం తీసిపోని విధంగా అద్భుతమైన ఇంజనీరింగ్ అల్లికలతో ఏర్పాటు చేసుకునే ఈ గూళ్లు తుపాను వచ్చినా, భీకర గాలులు వీచినా ఒక్క గడ్డి పోచ కూడా కింద పడకుండా తట్టుకోవడం ఆశ్చర్యం కలగక మానదు. కనువిందు చేసే ఈ అందమైన పక్షి గూళ్లు కేవలం మగజాతి గిజిగాడు మాత్రమే నిర్మించుకోవడం మరో విశేషంగా చెప్పవచ్చు. ఆదిలాబాద్ కేంద్రానికి సమీపంలోని శంకర్ గుట్ట, దుర్గా నగర్, మావల, కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ సమీపంలోని కాలువలగట్లపై తుమ్మ చెట్లకు వేలాడే గిజిగాడి గూళ్ళు అందరిని ఆకట్టుకుంటున్నాయి.

వాస్తవ తెలంగాణ

### నైపుణ్యం.. నేర్పరితనం మేళవించి..

గిజిగాడు నిర్మించే గూడులో అద్భుతం ఇంజనీరింగ్ నైపుణ్యమే కాకుండా నేర్పరితనం మనకు గోచరిస్తుంది. గడ్డి పోచలను ముక్కుతో పట్టుకొచ్చి అల్లికలతో శత్రు దుర్భేద్యంగా మగ జాతి పక్షులు గూళ్లు నిర్మించుకుంటాయి. ఒక్కో పక్షి గూడు కట్టడానికి 18 నుండి 21 రోజులు పడుతుందని పక్షుల జాతిని అధ్యయనం చేసే ఆర్నిథాలజిస్ట్ నిపుణులు పేర్కొంటున్నారు. శత్రువులను ఎదుర్కోవడం, పొదిగిన గుడ్లు, పిల్లలను కాపాడుకోవడానికే ముళ్ల చెట్లపై కాలనీ తరహాలో వరుసగా గూళ్ళు నిర్మించుకుంటాయి. ఆడ పక్షికి ఈ గూడు నచ్చితే వెంటనే అక్కడికి వాలిపోయి మగపక్షితో కలిసి జతకడుతుంది. పాములు ఇతర కీటకాలు ఇందులోకి వెళ్లేందుకు సాహసం చేయవు.

### ఆడ పిట్టను బుట్టలో వేసేందుకే..

కేవలం మగ జాతి గిజిగాడు పక్షులు మాత్రమే అందంగా గూళ్లు నిర్మించుకుంటే.. ఆడ జాతి బుల్లి పిట్టలు వీటిని ఆకట్టుకొని సహజీవనం సాగించడం మరో ప్రత్యేకతగా చెప్పవచ్చు. 'ప్లోసిడే' కుటుంబానికి చెందిన ఈ బంగారు పిట్ట శాస్త్రీయ నామం "ప్లోసియస్ ఫిలిప్పీనస్"గా పిలుస్తారు. తలపైన పసుపు రంగు కిరీటంతో ఉండే ఈ మగ పక్షి.. ఆడ పక్షిని ఆకట్టుకుంటూ బుట్టలో వేసుకుంటాయి. ఎంత పెద్ద గాలులు వీచినా ఒక్క గూడు కూడా చెదిరిపోదని హార్టికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు "ఆంధ్రప్రభ"కు వివరించారు. పునరుత్పత్తిలో ఒక్కో ఆడ పక్షి రెండు నుండి ఐదు గుడ్లు పెట్టి ఆ తర్వాత పిల్లలకు ఆహారాన్ని నోటితో అందిస్తుంది. ఆదిలాబాద్, నిర్మల్, బోథ్ , ఖానాపూర్ ప్రాంతాల్లో జూన్ నెలలోనే ఎక్కువగా చెట్ల కొమ్మలపై వేలాడే గిజిగాడి పక్షి గూళ్లు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గడ్డి పోచల అల్లికలతో అందమైన గూళ్ళు పక్షుల జాతి వైవిధ్యం, జీవన ఆవాసం చూపరులకు విచిత్రంగా కనిపిస్తోంది.

## కుప్పలు తెప్పలుగా..
# డూప్లికేట్ ఓట్లు
### రేవంత్ రెడ్డి గెలిచింది ఆ ఓట్లతోనే

- కొడంగల్ లో ఏకంగా 32 వేల డూప్లికేట్స్
- డబుల్ ఓట్లను తొలగించాలని కవిత డిమాండ్




వాస్తవ తెలంగాణ

తెలంగాణ లో కుప్పతెప్పలుగా డూప్లికేట్ ఉన్నాయని, వాటిని తక్షణం తొలగించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని.. వీటిని తొలగించేందుకు ఏడేళ్లు పట్టిందని ప్రస్తావించారు. హైదరాబాద్ లో నివసిస్తున్న వేలాదిమందికి ఏపీలో కూడా ఓట్లు ఉన్నాయన్నారు.. హైదరాబాద్ లోని పార్టీ కార్యాలయంలో ఆమె సోమవారం మీడియాతో మాట్లాడుతూ దేశంలో ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) జరిగిందని అయినా దొంగ ఓట్లు మాత్రం అలాగే ఉన్నాయన్నారు. బోధన్ నియోజకవర్గంలో ఏడాదిలో 7 వేల ఓట్లు తీసేశారని.. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### కొడంగల్ లో 33 వేల డూప్లికేట్ ఓట్లు

సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో కేవలం 800 ఓట్లు మాత్రమే తొలగించారని కవిత అన్నారు. కొండగల్‌లో తాము వెరిఫై చేస్తే 33వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో డూప్లికేట్ ఓట్లు చాలా ఉన్నాయని తెలిపారు. మొన్నటి ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి డూప్లికేట్ ఓట్లతోనే గెలిచారని తమకు అనుమానం ఉందని చెప్పారు. కర్ణాటక నుంచి నోటు ట్రాన్స్‌ఫర్‌తో పాటు ఓటు ట్రాన్స్‌ఫర్ అయిందా అనే అనుమానం తమకు కలుగుతోందని కవిత పేర్కొన్నారు. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'సర్' దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రాల మధ్య ఉన్న డేటాను వెంటనే పరిశీలించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఉన్న ఓటర్లకు ఏపీలో కూడా ఓటు ఉందని... ఎక్కడైనా ఒక చోట మాత్రమే ఉండేలా చూడాలని సూచించారు. ఇంటర్ స్టేట్ డూప్లికేట్ ఓట్లను తొలగించాలన్నారు. ఎన్నికల సంఘానికి ఈ విషయాలపై ఫిర్యాదు చేస్తామని కవిత పేర్కొన్నారు.

## ఏరువాక పౌర్ణమి సందర్భంగా గోమాత పూజలో పాల్గొన్న సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి



**వాస్తవ తెలంగాణ సంగారెడ్డి** సంగారెడ్డి జిల్లా మల్లెపల్లి గ్రామంలో పవిత్రమైన ఏరువాక పౌర్ణమి పర్వదినం సందర్భంగా గోమాత పూజా కార్యక్రమంలో పాల్గొన్న సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి గోమాతకు ప్రత్యేకపూజలు నిర్వహించడం జరిగింది. లోకకళ్యాణం కోసం, రైతాంగ శ్రేయస్సు కోసం ఆ గోమాత ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించాను.?భూమాత చల్లని ఆశీస్సులతో ఈ ఖరీఫ్ సీజన్లో కాలం కలిసిరావాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రతి చేనూ పచ్చని పంటలతో కళకళలాడాలని ఆకాంక్షిస్తున్నాను. కష్టజీవి అయిన రైతు కుటుంబంలో ఆనందం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆ పరమేశ్వరుడిని వేడుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్ రావు దేశ్ పాండే , బీజేపీ నాయకులు వాసు,నాగ రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఒకే వ్యక్తికి ఒకే చోట ఒక్క ఓటు .. నాగారం కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి..



**ఘట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్‌లోని ప్రతి ఓటరు మహాశయులకు నా హృదయపూర్వక విజ్ఞప్తి.ప్రస్తుతం ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో, ప్రతి ఒక్కరూ తమ ఇంటి చిరునామాపై నమోదైన ఓటర్ల వివరాలను తప్పనిసరిగా ఒకసారి పరిశీలించండి. కొన్నిచోట్ల మీకు తెలియకుండానే ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తుల పేర్లు మీ ఇంటి చిరునామాపై నమోదై ఉండే అవకాశం ఉంది. అలాంటి తప్పులు లేదా అనర్హ నమోదులు ఉంటే, వాటిని తొలగించేందుకు సంబంధిత ఎన్నికల అధికారులకు సహకరించండి.అలాగే, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు నమోదు ఉండటం చట్టానికి విరుద్ధం. ప్రతి పౌరుడికి ఒకే చోట ఓటు నమోదు ఉండాలి. అందువల్ల మీకు ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు ఉంటే, వెంటనే ఒక చోట మాత్రమే ఉంచి మిగిలిన నమోదును తొలగించేందుకు చర్యలు తీసుకోండి.ఎవరైనా "ఏమీ కాదు", "నేను చూసుకుంటాను" అని చెప్పినా, చట్టపరమైన బాధ్యత మాత్రం సంబంధిత వ్యక్తిపైనే ఉంటుంది. అందువల్ల ఇతరుల మాటలు నమ్మకుండా, చట్టాన్ని గౌరవిస్తూ సరైన విధంగా ఓటరు నమోదును కొనసాగించండి.మనమందరం కలిసి దొంగ ఓట్లను, అనర్హ నమోదులను తొలగించి, పారదర్శకమైన, నిష్పాక్షికమైన ఓటరు జాబితా తయారవడానికి సహకరిద్దాం. అదే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే మార్గం.

**మన నినాదం:** "ఒక్క వ్యక్తికి -- ఒక్క ఓటు, ఒక్క చోటే ఓటు."అని ముప్పు శ్రీనివాస్ రెడ్డి నాగారం డివిజన్ ప్రజలకు పిలుపునిచ్చారు.

# శ్రీ ఆంజనేయ స్వామి ఆశీస్సులతో రాష్ట్రంలో సుభిక్షం కలగాలి



వాస్తవ

**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ ప్రతినిధి:-** ఆంజనేయ స్వామి కటాక్షంతో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐకమత్యాన్ని, సత్సంప్రదాయాలను బలోపేతం చేస్తాయని మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మదేవేందర్ రెడ్డి పేర్కొన్నారు.మెదక్ జిల్లా శంకరంపేట మండలం కామారం తండాలో నిర్వహించిన శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శ్రీ ఆంజనేయ స్వామి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐకమత్యాన్ని, సత్సంప్రదాయాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ఐక్యంగా ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని, శ్రీ ఆంజనేయ స్వామి కటాక్షంతో ప్రతి కుటుంబం సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ శంకరంపేట (ఆర్) మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, మాజీ జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్య రెడ్డి, కామారం తండా సర్పంచ్ మోహన్ నాయక్, శేరిపల్లి సర్పంచ్ గోండ స్వామి, మల్లుపల్లి సర్పంచ్ ఇమ్మడి నరేష్, మాజీ సర్పంచులు పూలపల్లి యాదగిరి యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, దయానంద్ యాదవ్, మంచాల లక్ష్మణ్, బందెల ప్రభాకర్, రాములు నాయక్, మండల నాయకులు ఎం. చంద్రం, రవీందర్ నాయక్, తీగుళ్ల స్వామి, మున్యా నాయక్, పరుశురాం నాయక్, కందరి శ్రీనివాస్, బైండ్ల రాజ్‌కుమార్, చాకలి నవీన్, గోపాల్ నాయక్, వినోద్ నాయక్, సురేందర్ నాయక్‌తో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా పాలన--99 రోజుల ప్రగతి ఛాయాచిత్ర ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** ప్రజా పాలన--99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేలా జిల్లా పౌర సంబంధాల శాఖ ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.సోమవారం ప్రజావాణి సందర్భంగా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన--99 రోజుల ప్రగతి ప్రణాళిక, వివిధ శాఖల సంక్షేమ వారోత్సవాల ఛాయాచిత్ర ప్రదర్శనను కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి వీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన--99 రోజుల ప్రగతి ప్రణాళికను మెదక్ జిల్లాలో అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. జిల్లాలో అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఛాయాచిత్రాల రూపంలో ప్రజలకు పరిచయం చేయడం అభినందనీయమన్నారు.

ప్రతి సోమవారం ప్రజావాణి సందర్భంగా ఈ ఛాయాచిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేసి ప్రజలు వీక్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా పౌర సంబంధాల శాఖ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్రరాజు,డిఆర్డిఏపిడి శ్రీనివాస్ రావు, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య,ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ (కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని మహానగర్ కమిటీ హా ప్రాంగణంలో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేష ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించి ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచ విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి శిబిరాన్ని సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్య పరిరక్షణలో ముందస్తు పరీక్షలు అత్యంత కీలకమని, ముఖ్యంగా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే సమర్థవంతమైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించేందుకు ఉపయోగపడుతున్న మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని పరిశీలించి, అందులో అందిస్తున్న వైద్య సేవలు, పరీక్షల విధానం, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ చేపడుతున్న ప్రజారోగ్య కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని భరత్ సింహారెడ్డి అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించి ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, వైద్య బృందం, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు.

# భవాని నగర్‌లో యూజీడీ, సీసీ రోడ్ల పనులు వేగవంతం చేయాలి



**కొంపల్లి, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు....** సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని భవాని నగర్ కాలనీలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ), సీసీ రోడ్ల నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలని భవాని నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కుత్బుల్లాపూర్ జోన్ జోనల్ కమిషనర్‌ను కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఆకుల సతీష్ నేతృత్వంలో వినతిపత్రం సమర్పించారు. కాలనీలో యూజీడీ పనులు అసంపూర్తిగా ఉండటంతో మురుగు నీరు రోడ్లపైకి చేరి నిల్వ నీరు ఏర్పడుతోందని, దీంతో అంతర్గత రహదారులు దెబ్బతినడంతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రతినిధులు జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వినతిపై స్పందించిన జోనల్ కమిషనర్ సమస్య తీవ్రతను గుర్తించి తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులు మూడు రోజుల్లో కాలనీని సందర్శించి పెండింగ్ పనులను పరిశీలించి, వాటి పూర్తి కోసం కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. యూజీడీ పనుల విషయంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) అధికారులతో సమన్వయం చేసి సమస్యలను పరిష్కరించి పనులు వేగవంతం చేస్తామని అధికారులు తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను కూడా ప్రాధాన్యతతో ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. జోనల్ కమిషనర్ హామీపై కాలనీ వాసులు సానుకూలంగా స్పందించారు. ఇచ్చిన హామీలను అమలు చేసి యూజీడీ, సీసీ రోడ్ల పనులను ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆకుల సతీష్, నల్ల జైశంకర్ గౌడ్, పులి బలరాం, రవివర్మ, గిరిజ, నాగరాజ్ గౌడ్, మనీష్, హిమాన్షు దూబే తదితరులు పాల్గొన్నారు.

# పద్మా నగర్ ఫేజ్-2లో విజయవంతంగా ఎస్ఐఆర్ ఓటరు ధృవీకరణ




**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు....** జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని పద్మా నగర్ ఫేజ్–2లో సోమవారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు వెరిఫికేషన్, అవగాహన సదస్సు విజయవంతంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) కాలనీవాసుల సమక్షంలో అందుబాటులో ఉన్న ఓటర్ల వివరాలను పరిశీలించి ధృవీకరణ ప్రక్రియను చేపట్టారు. అర్హులైన ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ అవసరమైన సవరణలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పద్మా నగర్ ఫేజ్–2 కాలనీ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకొని, ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సవరించుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాలనీ ప్రజలు, సొసైటీ సభ్యులు స్వచ్ఛందంగా పాల్గొని వెరిఫికేషన్ ప్రక్రియను విజయవంతం చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన బీఎల్‌వోలు, సహకరించిన సొసైటీ సభ్యులు, కాలనీవాసులందరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఎన్నికల సంఘం నిర్వహించే ప్రజా ప్రయోజన కార్యక్రమాలకు ఇదే విధంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, సొసైటీ సభ్యులు, మహిళలు, యువత, స్థానిక ప్రజలు, బీఎల్‌వోలు పాల్గొని ఓటరు ధృవీకరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రజల చురుకైన భాగస్వామ్యంతో ఎస్ఐఆర్ కార్యక్రమం లక్ష్యాన్ని సమర్థవంతంగా సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఓటు హక్కు వినియోగానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి




**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల డివిజన్ (కుత్బుల్లాపూర్ డివిజన్) పరిధిలోని ఎం.ఎన్.రెడ్డి నగర్‌లో చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి సోమవారం పరిశీలించారు. బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ)తో కలిసి కొనసాగుతున్న ఓటరు ధృవీకరణ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, అక్కడి అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భరత్ సింహా రెడ్డి మాట్లాడుతూ, ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు సక్రమంగా నమోదైందో లేదో తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని సూచించారు. ఓటరు వివరాల్లో పేరు, చిరునామా, వయస్సు లేదా ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత బీఎల్ఓను సంప్రదించి సవరణలు చేసుకోవాలని కోరారు. అలాగే కొత్తగా అర్హత సాధించిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని, చిరునామా మారిన వారు అవసరమైన మార్పులు చేయించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన ఓటరు జాబితా అత్యంత అవసరమని, ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు మాత్రమే కాకుండా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే బాధ్యత కూడా అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓతో పాటు స్థానిక బీజేపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# కర్ణాటకలోని గనగాపూర్ శ్రీ గురు దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని దర్శించిన వీరశైవ లింగాయత్ సమాజం




**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** దాశివపేట పట్టణం వీరశైవ లింగాయత్ సమాజం గౌరవ సలహాదారులు శ్రీ అనిమిశెట్టి జయప్రకాశ్ మాట్లాడుతూఏరువాక పున్నమి సందర్భంగా ప్రజలందరూ సుఖశాంతులు, సుభిక్షాలతో ఉండాలని శ్రీ గురు దత్తాత్రేయ స్వామిని ప్రార్థించినట్లు తెలిపారుఈ కార్యక్రమంలో యువజన అధ్యక్షులు బుగ్గనగారి మల్లికార్జున్ కంది మాజీ సర్పంచ్ వీరేశం గోపాల్ సునీల్ కుమార్ అపెక్స్ తదితరులు పాల్గొన్నారు.
“ఏరువాక పున్నమి సందర్భంగా ప్రతి ఇంట ఆనందం ప్రతి రైతు కుటుంబం సుభిక్షంగా ఉండాలని శ్రీ గురు దత్తాత్రేయ స్వామిని ప్రార్థించాముఅని వారు పేర్కొన్నారు.

# ఆరోగ్య భద్రతకు సీఎం రిలీఫ్ ఫండ్.. పేదల ఆరోగ్యానికి అండగా బీఆర్ఎస్ -- వీరారెడ్డి నరేందర్ రెడ్డి




**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు....** అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఫీ) ద్వారా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ పత్రాలను సోమవారం చింతల్‌లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జీడిమెట్ల 132వ డివిజన్‌కు చెందిన 16 మంది లబ్ధిదారులకు 5,22500 విలువగల చెక్కులను బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, "పేద ప్రజల ఆరోగ్య భద్రతే మా ప్రధాన లక్ష్యం. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలవడం మా బాధ్యత. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అనేక నిరుపేద కుటుంబాలకు మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కి ప్రజలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములై సేవ చేయడమే మా ధ్యేయం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సేవా శిరోమణి అవార్డుతో రవీందర్ ముదిరాజ్‌కు ఘన సత్కారం

**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, యువతలో చైతన్యం పెంపొందించడంలో విశేష కృషి చేస్తున్న సామాజిక కార్యకర్త రవీందర్ ముదిరాజ్కు "సేవా శిరోమణి అవార్డు" ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ న్యాయమూర్తి మధుసూదన్, ప్రముఖ పారిశ్రామికవేత్త చల్ల రాజశేఖర్ రెడ్డి, ప్రముఖ జ్యోతిష్యురాలు భాగ్యలక్ష్మి రెడ్డి, రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ ఎం.డి. హమీద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిటైర్డ్ న్యాయమూర్తి మధుసూదన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ అంకితభావంతో తమకు అనుభవం ఉన్న రంగాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని సూచించారు. యువత న్యాయాన్ని గౌరవిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని, తమ శక్తి సామర్థ్యాలను ఇతరులకు ఉపయోగపడే విధంగా వినియోగించాలని పిలుపునిచ్చారు. ప్రముఖ పారిశ్రామికవేత్త చల్ల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, యువత ఉన్నత విద్యతో పాటు సాంకేతిక విద్యను అభ్యసించి, ఉద్యోగాలు వెతికేవారిగా కాకుండా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. యోగను ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని, యోగ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యోగలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ ఎం.డి. హమీద్, ప్రముఖ జ్యోతిష్యురాలు భాగ్యలక్ష్మి రెడ్డి మాట్లాడుతూ,



రవీందర్ ముదిరాజ్ చేస్తున్న సామాజిక సేవలను కొనియాడారు. ప్లాస్టిక్ నిర్మూలనపై నిరంతర అవగాహన కల్పించడం, పాఠశాలల్లో ఈత ప్రాముఖ్యతపై విద్యార్థులకు చైతన్యం తీసుకురావడం, నీటి సంరక్షణ, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతల ఏర్పాటు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సేవలను గుర్తించి రవీందర్ ముదిరాజ్‌కు "సేవా శిరోమణి అవార్డు" ప్రదానం చేసి శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అవార్డు స్వీకరించిన అనంతరం రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, ఈ గౌరవంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఇకపై సమాజ సేవకు మరింత సమయం కేటాయిస్తూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు. అందరి సహకారం ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని, ప్రతి వ్యక్తిలో పట్టుదల, కృషి, సేవాభావం ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, యోగా సాధకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యల్లో నిర్లక్ష్యం: జోనల్ కమిషనర్‌కు అక్కల సురేష్ కుమార్ ఫిర్యాదు



**ఘట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/**మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ, శివసేన తెలంగాణ మెడ్చల్ ఇన్‌చార్జ్ అక్కల సురేష్ కుమార్ ఉప్పల్ జోన్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో జోనల్ కమిషనర్ రాధికా గుప్తాకు లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు.అక్రమ నిర్మాణాలపై ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, నాగారం డివిజన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఏసీపీ రాజీవ్ రెడ్డికి పలుమార్లు ఫిర్యాదు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకోలేదని ఆయన తెలిపారు.(మై క్యూర్)యాప్, అధికారిక గ్రీవెన్స్ పోర్టల్, ఇన్‌వార్డ్ ఫిర్యాదులు,( ఎక్స్)ద్వారా కూడా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. అధికారుల జాప్యం వల్ల అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం, భవన నిర్మాణ నిబంధనలపై ప్రజల్లో విశ్వాసం తగ్గుతోందని ఆయన అన్నారు. సంబంధిత అధికారుల పనితీరుపై స్వతంత్ర విచారణ జరిపి, నిర్లక్ష్యం నిర్ధారణ అయితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను అక్కల సురేష్ కుమార్ శివసేన తెలంగాణ మెడ్చల్ ఇన్‌చార్జ్ కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు....** మేడ్చల్ మెట్రో రైలు సాధన సమితి ప్రతినిధులతో కలిసి కొంపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కే.పీ. వివేకానంద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా ప్రజలకు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ముఖ్యంగా మేడ్చల్ మెట్రో రైలు ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు.ప్రజల దృష్టి మళ్లించేందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో విభేదాలు ఉన్నట్లు చిత్రీకరించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని ఆరోపించారు. ఢిల్లీలో కేంద్ర నాయకులతో సఖ్యతగా వ్యవహరిస్తూనే, రాష్ట్రానికి వచ్చాక భిన్నంగా మాట్లాడటం ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయమని అన్నారు.ఎల్ అండ్ టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మెట్రో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న తర్వాత దాని పురోగతి పూర్తిగా నిలిచిపోయిందని, అభివృద్ధి పనులు ముందుకు సాగకుండా కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టినట్లుగా వ్యవహరిస్తోందని విమర్శించారు.మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికైన రేవంత్ రెడ్డి, ఆ ప్రాంత ప్రజలకు ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు చేయకుండా కేవలం రాజకీయ ప్రచారానికే పరిమితమయ్యారని పేర్కొన్నారు. మేడ్చల్ మెట్రో రైలు సాధన సమితి చేపట్టే ఉద్యమానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మెట్రో ప్రాజెక్టు అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజాస్వామ్యబద్ధంగా ఒత్తిడి తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందిస్తామని ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద తెలిపారు.

# దూలపల్లిలో అక్రమ మద్యం విక్రయాలపై పోలీసుల మెరుపుదాడి





**పేట్ బషీరాబాద్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు......** దూలపల్లిలో అక్రమంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తున్న వ్యక్తిపై పేట్ బషీరాబాద్ పోలీసులు అర్ధరాత్రి మెరుపుదాడి నిర్వహించి 23 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 28/29 తేదీల అర్ధరాత్రి సుమారు 12.30 గంటల సమయంలో దూలపల్లిలోని ఓ ఇంటిలో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పెట్రోలింగ్ సిబ్బంది ఇద్దరు పంచుల సమక్షంలో సంబంధిత ఇంటిపై దాడి నిర్వహించారు. తనిఖీల్లో విక్రయాల కోసం అక్రమంగా నిల్వ ఉంచిన మొత్తం 23 లీటర్ల మద్యాన్ని పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ఘటన స్థలంలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలు, నిల్వలు, రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పేట్ బషీరాబాద్ పోలీసులు హెచ్చరించారు.

# "సర్" ప్రక్రియ పారదర్శకంగా సాగేలా చూడాలి - మందుముల పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్ నియోజకవర్గం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఉప్పల్ నియోజకవర్గం భారత ఎన్నికల సంఘం చేపట్టిన "సర్" సాఫీగా సాగేలా చూడాలని ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సోమవారం ఉప్పల్ డివిజన్ పరిధిలోని భరత్ నగర్‌లో విస్తృతంగా పర్యటించి క్షేత్ర స్థాయిలో "సర్" ప్రక్రియ తీరును పరిశీలించారు. కాలనీలలో విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులను (బీఎల్‌ఓలు) కలిసి 'సర్' ప్రక్రియ ఏ విధంగా జరుగుతోంది, నమోదు మరియు మార్పుల ప్రక్రియ ఎక్కడివరకు వచ్చింది, ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తోంది అనే విషయాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిజమైన ప్రతి ఓటరుకు ఈ ప్రక్రియతో అన్యాయం జరుగకుండా చూడాలని , ఎలాంటి లోపాలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ తిరుగుతున్న బూత్ స్థాయి అధికారులను (బీఎల్‌ఓలను) కలిసి, భరత్ నగర్‌లో సర్వే ఏ విధంగా జరుగుతోందో అడిగి తెలుసుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది సామాన్యుడికి ఉన్న అతిపెద్ద ఆయుధమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ శ్రేణులు ఈ ప్రక్రియలో పూర్తి బాధ్యతతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. (ఎస్ ఐ ఆర్)ప్రక్రియ ద్వారా అర్హులైన, నిజమైన ఒక్క ఓటరు పేరు కూడా పొరపాటున ఓటర్ల జాబితా నుండి తొలగిపోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి అక్రమాలు, బోగస్ ఓట్లు లేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఈ (ఎస్ ఐ ఆర్)సవరణ ప్రక్రియ జరగాలని డిమాండ్ చేశారు. ఓటర్ల సవరణ లేదా కొత్తగా నమోదు చేసుకునే ప్రక్రియలో సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి సులభంగా అవగాహన కల్పించేలా మన బూత్ లెవల్ ఏజెంట్లు (బి ఎల్ ఏ లు) సహాయపడాలని సూచించారు.

# ప్రభుత్వ ప్రతిపాదిత మై క్యూర్ యాప్ లలో లోపాలు.,ప్రజలకు తిప్పలు..




**ఘట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్)** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ సర్కిల్ లోని నాగారం మున్సిపాలిటీ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనమైన సందర్భంగా గతంలో కంటే మెరుగైన పౌర సేవలు లభించాల్సిన చోట గతంలో కన్నా తిరోగమణంలో ప్రయాణిస్తున్నట్లు కనబడుతుంది ఎందుకు అనగా గతంలో వీధిదీపాలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు వచ్చినచోట రెండు లేదా మూడు రోజుల్లో పరిష్కరించేవారు కానీ ఇప్పుడు 20 రోజులు గడిచిన పట్టించుకునే నాధుడు కరువయ్యాడు, ఎవరైనా పౌరుడు మై క్యుర్ యాప్ లో వీధి దీపాలు వెలగడం లేదని ఫిర్యాదు చేస్తే ఆన్లైన్ లో అట్టి సమస్యను పరిష్కరించినట్టుగా జవాబు ఇస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో అట్టి సమస్యను పట్టించుకున్న పాపాన పోవడం లేదు . కాలనీలలో చిమ్మ చీకట్లు ఆలముకున్న ఉలుకు పలుకు లేదని నాగారం డివిజన్ ఎస్వి నాగర్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పదవులతో పనిలేదు,ప్రతి క్షణం,ప్రజా క్షేత్రం లో చిన్నం రాజు సాయినాథ్ గౌడ్



**ఘట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ సర్కిల్ లో నాగారం మున్సిపాలిటీ పరిధిలో పల్స్ పోలియో ప్రోగ్రాం లో నాగారం మాజీ వర్డ్ సభ్యులు బి అర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిన్నం రాజు సాయినాథ్ గౌడ్ పాల్గొని పల్స్ పోలియో కార్యక్రమం లో పాల్గొన్నారు. పసి పిల్లల ఉజ్వల భవిష్యత్తు కు పల్స్ పోలియో చుక్కల మందు వారి జీవితానికి ఉజ్వలమైన భవిష్యత్తుకు తొలి మెట్టు అని సాయినాథ్ గౌడ్ అన్నారు. ప్రతి తల్లి తండ్రులు వారి పిల్లలు విధిగా పోలియో చుక్కల మందు వేయించాలి అని నాగారం డివిజన్ బి అర్ ఎస్ నాయకులు మాజీ వర్డ్ సభ్యులు సాయినాథ్ గౌడ్ అన్నారు.మరియు నాగరం మున్సిపాలిటీ పరిధిలో" సర్ " కార్యక్రమం లో బాగంగా పాల్గొని ఓటరు నమోదు కార్యక్రమన్నీ పర్యవేక్షించారు. ప్రతి ఒక్కరూ ఒకే చోట ఒకే ఓటు నమోదు తో ప్రదర్శకంగా యువత, ప్రజలు ఈ" సర్" ఈ కార్యక్రమంలో పాల్గొనాలి అని సాయినాథ్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమం లో నాగారం డివిజన్ బి అర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నిమ్మల శ్రీనివాస్ , బీజేపీ సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి విజయ్ కుమార్ ,మరియు రవి పాల్గొనడం జరిగింది.

https://epaper.vasthavatelangana.com
మంగళవారం,30 జూన్, 2026
వాస్తవ తెలంగాణ


# మైనార్టీల అభ్యున్నతే లక్ష్యం జిల్లా అభివృద్ధికి సమిష్టి కృషి




**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి** మైనార్టీల అభ్యున్నతే తమ లక్ష్యమని, జిల్లా అభివృద్ధికి సమిష్టి కృషిచేద్దామని మెదక్ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ చైర్మన్ ఎం.డి. సూఫీ జానీ తెలిపారు. నూతనంగా మెదక్ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ చైర్మన్‌గా నియమితులైన ఎం.డి. సూఫీ జానీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సోమవారం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ భేటీ సందర్భంగా జిల్లా అభివృద్ధి, మైనార్టీల సంక్షేమం, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, విద్యాభివృద్ధి తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.అనంతరం మెదక్ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ చైర్మన్ ఎం.డి. సూఫీ జానీ మాట్లాడుతూ మైనార్టీల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళికలు అవసరమన్నారు.జిల్లాలోని మైనార్టీ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.ముఖ్యంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.మైనార్టీ వర్గాలకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.జిల్లా సమగ్ర అభివృద్ధిలో మైనార్టీల పాత్ర కీలకమని, సమాజంలోని అన్ని వర్గాలు అభివృద్ధి చెందితేనే నిజమైన పురోగతి సాధ్యమవుతుందని ఎం.డి. సూఫీ జానీ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు మైనార్టీ వర్గాలు పూర్తి సహకారం అందిస్తాయని తెలిపారు.నేటి పోటీ ప్రపంచంలో యువత విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ మహమ్మద్ అమీరుద్దీన్, మాజీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్యాంసుందర్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ ఆదిల్ పాషా, షేక్ అక్బరుద్దీన్, షేక్ ఫస్యుద్దీన్, షేక్ ఖాజా, ఎజాజ్, షానవాజ్, నదీమ్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకే సంఘం, ఒకే కులం తో దిగ్విజయంగా మున్నూరు కాపు సంఘం..

## శుభాకాంక్షలు తెలిపినా, నాగారం కాపు సంఘం నేతలు..

**కీసర మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా నాగారం డివిజన్ మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమ రావు పటేల్ మరియు వారి కార్యవర్గం ఎన్నికై ఒక సంవత్సరము పూర్తి అవుతున్న సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కర్రా వెంకటేశ్వరరావు పటేల్ మరియు జాయింట్ సెక్రటరీ పోతాం శెట్టి వెంకటేశ్వరరావు పటేల్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్టం లోనే ఒకే కులం ఒక సంఘం పేరుతో అత్యంత పటిష్టవంతంగా రాగ ద్వేశం లకు అతీతంగా ఎన్నికలు జరిపి ఎన్నుకున్న ఏకైక సంఘం మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్రం లోనే వినూత్న రీతిలో మున్నూరు కాపుల అభివృద్ధి సంక్షేమము సంఘటీత శక్తిని ఐక్యతను చాటుతూ పలు మైలు రాళ్లు దాటుతూ మున్నూరు కాపుల మన్ననలు ఆశీస్సులు పొందుతు నాలుగు కార్యవర్గం సమావేశం లు నలుమూలల జరుపుతూ సర్దార్ నాయకత్వం లో కొన సాగుతున్న సంఘం ఇక ముందుకూడా మున్నూరు కాపుల ఐక్యత సంఘటీత శక్తిని చాటుతూ బహుజన రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని ఆశిస్తూ కర్ర వెంకటేశ్వర్ పటేల్ రాష్ట్ర కార్యదర్శి మరియు పోతంశెట్టి వెంకటేశ్వర రావు పటేల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ లు సంఘం అధ్యక్షుడు కి కార్యవర్గానికి శుభబినందనాలు తెలిపారు.




# సహజీవనం చేస్తున్న మహిళను హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు: ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి** శివంపేట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్య కేసులో నిందితుడు వడ్డే రాములు (33), హత్నూర మండలం పాల్పనూరు గ్రామానికి చెందిన వ్యక్తికి జిల్లా ప్రధాన న్యాయస్థానం జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. 5,000 జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ.. కొమ్మిరే నర్సమ్మ అలియాస్ రేణుక (30) తన భర్తతో విడిపోయి గత ఆరు సంవత్సరాలుగా సదాశివపేట పట్టణంలోని సిద్ధాపూర్ కాలనీలో తన తల్లిదండ్రులతో పాటు తన ఆరు సంవత్సరాల కుమారుడితో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేదన్నారు. గత ఏడాది కాలంగా ఆమె హత్నూర మండలం పాల్పనూరు గ్రామానికి చెందిన వడ్డే రాములుతో సంగారెడ్డిలో గది అద్దెకు తీసుకుని సహజీవనం చేస్తోందని తెలిపారు. కుటుంబ ఆర్థిక అవసరాల కోసం రేణుక తరచూ డబ్బులు ఇవ్వాలని అడగడంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవని, ఈ క్రమంలో నిందితుడు ఆమెపై దాడులకు కూడా పాల్పడే వాడని పేర్కొన్నారు. 2023 ఆగస్టు 23న ఉదయం బయట పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి రాములుతో కలిసి వెళ్లిన రేణుక సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదన్నారు. మరుసటి రోజు చిన్న గోటిముక్కుల గ్రామ శివారులోని చకరిమెట్ల గుడి ఎదురుగా ఉన్న అటవీ ప్రాంతంలో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందగా, అక్కడికి చేరుకున్న తల్లిదండ్రులు ఎల్లయ్య, కిష్టమ్మ మృతదేహాన్ని రేణుకదిగా గుర్తించారని తెలిపారు. దర్యాప్తులో, డబ్బుల విషయంలో తలెత్తిన వివాదాలు మరియు ఇతర వ్యక్తిగత కారణాలతో రేణుకపై కక్ష పెంచుకున్న నిందితుడు ఆమెను హత్య చేయాలని ముందుగానే నిర్ణయించుకుని, అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి ఆమె




చీరతో గొంతు బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు తేలిందన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శివంపేట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో అప్పటి దర్యాప్తు అధికారి తూప్రాన్ సీఐ శ్రీధర్ సమగ్ర దర్యాప్తు నిర్వహించి, పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేశారని తెలిపారు. అనంతరం ప్రస్తుత దర్యాప్తు అధికారి వెంకట రాజా గౌడ్ విచారణలో సాక్షులను సమర్థవంతంగా ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించారని పేర్కొన్నారు. సమర్పించిన పూర్తి సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు మరియు ఇతర ఆధారాలను పరిశీలించిన గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి నీలిమ నిందితుడు వడ్డే రాములును దోషిగా నిర్ధారించి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. 5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో శివంపేట్ ఎస్ఐ మధుకర్ రెడ్డి, కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, శివంపేట్ సీడీఓ ఆనంద్, కేసు విచారణలో సహకారం అందించారని పేర్కొన్నారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, ప్రజా అభియోజకులు మరియు సహకరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.హత్య వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని, ప్రతి కేసులో శాస్త్రీయ దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాలతో బాధితులకు న్యాయం జరిగేలా మెదక్ జిల్లా పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.

# ఏడుపాయల ఆలయ అభివృద్ధికి రూ.7 కోట్లు



**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ టౌన్ జూన్ 29:-** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గ భవానీ ఆలయంలో భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు 12 కాటేజీల నిర్మాణానికి రూ. 7 కోట్ల నిధులు మంజూరైనట్లు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు.ఏడుపాయల ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం ఈ నిధులను మంజూరు చేసిందన్నారు. టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రత్యేక కార్యదర్శి వాణీ ప్రసాద్ ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలిపారు.ఏడాది పొడవునా వేలాది మంది భక్తులు దర్శించుకునే ఆలయంలో వసతి సౌకర్యాల కొరతను దృష్టిలో ఉంచుకుని కాటేజీల నిర్మాణానికి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చి మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని చెప్పారు.“అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే” అని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రజల ఆశీస్సులు, అమ్మవారి కృపతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు.

# అక్రమ నిర్మాణాల్లో ఆగని ఘట్కేసర్ టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు..

**ఘట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ లో ఎక్కడిక్కడ అక్రమ నిర్మాణాలు వెలుస్తున్న అధికారులు కన్నెత్తి కూడా చూడకుండా అక్రమ నిర్మాణదారు లతో కుమ్మక్కు అయ్యారని ప్రజల్లో బలంగా నటూక పోయింది.మునుముందు నిర్మాణ దారుల్లో సర్కిల్లో ప్రభుత్వ నిబంధనల్లో ఒక రకమైన ఆందోళన వ్యక్తమవుతుంది. ప్రభుత్వ నిబంధనలు మార్పులు,చేర్పులు చేశారా అన్నా అపోహలు కూడా ఉన్నప్పటికీ ఒక నిర్దిష్టమైన సమాచారం ఘట్కేసర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారులు ఇవ్వలేక పోతున్నారు. పెంటహౌస్, గ్రౌండ్, కమర్షియల్ శెట్టర్ల నిర్మాణం పై ఘట్కేసర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారులకు, ఫీల్డ్ అసిస్టెంట్ బిక్షపతి కి వాట్సాప్ లో సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించకపోవడం మామూళ్ళు ముట్టాయనా లేక చట్టం చుట్టమా అని వాపోతున్నారు. టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్ బిక్షపతి కి పై అధికారులు చెప్పినా బిక్షపతి సరైనా సమయం లో స్పందించట్లేదు అని అధికారుల దగ్గర మోర పెట్టుకుంటున్నారు.బిల్డర్ మాత్రం జి+1 పర్మిషన్ తో కమర్షియల్ శెట్టర్ల నిర్మాణం మరియు 60% శాతం తో అధికంగా నిర్మాణం చేసినా సంబంధిత అధికారులు వారిపై కనికరం చూపుతున్నారు. ఇంటి కొనుగోలు దారులకు ధరల విషయం లో కమర్షియల్ ఇంటి ధర పెరగడం తో కొనుగోలు దారులకు ఇళ్ల కొనుగోలు గుది బండల తయారైంది అని, ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారులు ప్రజలకు సరైనా నిబంధనలు తెలియచేయాలి అని, చట్టాలపై అందరికీ సమానం అనే ధోరణి ప్రజల్లో తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.




# ప్రజా క్షేత్రం లో నాయకులు..,పల్స్ పోలియో కార్యక్రమం లో పాల్గొన్నా గౌరారం క్రిష్ణ,బోనాల రాజు..



**గజ్వేల్ నియోజకవర్గం వాస్తవ తెలంగాణ న్యూస్/** సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం కుకునూర్పల్లి మండల కేంద్రం లో 3వ అంగనవ్వడి సెంటర్ లో బీజేపీ సిద్దిపేట జిల్లా లికౌన్సిల్ మెంబెర్ గౌరారం కృష్ణ మరియు మండల ప్రధాన కార్యదర్శి బోనాల రాజు పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమానికి హాజరై ప్రారంభించారు. ఈ క్రమంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగింది. పసి పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం పోలియో చుక్కల మందు తప్పనిసరిగా వేయించాలి అది వారి జీవితానికి ఉజ్వల భవిష్యత్తు ను అందిస్తుంది అని నాయకులు గౌరారం క్రిష్ణ, బోనాల రాజు అన్నారు.ఈ సందర్భంగా ప్రపంచాన్ని పోలియో రహితంగా మార్చేందుకు అందరం ఏకమవుదామని నాయకులు పిలుపునిచ్చారు.అదే విదంగా మన ప్రాంతంలో వున్నా అందరికి చిన్న పిల్లలకు బీజేపీ పార్టీ నాయకులు కార్యకర్తలు 5 సంవత్సరంలో పిల్లలందరినీ అంగన్వాడి సెంటర్ తీసుకెళ్లాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ భారతి మేడం భాగ్య అదే విధంగా బిజెపి మండల పార్టీ కన్వీనర్ కోరే సంతోష్ మరియు సీనియర్ నాయకులు సదానంద గౌడ్ కార్యకర్తలు ఎం ఆర్ పి ఎస్ నాయకులు కిషన్ పాల్గొన్నారు.

Editor, printer, published Owned by CHINTHALA RAMAKRISHNA Gummadidala (M&V) SANGAREDDY DIST TELANGANA State 502313 ph 8499902850/RNI NO:TELTEL/2022/81794